సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 6 । ఆగస్టు । 2025



ఫుట్‌బాల్ విజేత వైఎస్సార్ జిల్లా

మదనపల్లె మండలంలోని బోతోబోలు వేదా పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీల్లో విన్నర్స్‌గా వైఎస్సార్ కడప జిల్లా నిలిచింది. -10లో



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కమలాపురం మండలం నల్లలింగాయపల్లెలోని డీఏవీ భారతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎంవీ.నరేష్ రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపికయ్యారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.540
రెండోరకం	రూ.300	రూ.380



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 238 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	650	650
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 113.340 కిలోలు

న్యూస్‌రీల్

నేడు మినీ ఉద్యోగమేళా

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 6వ తేదీన మినీ ఉద్యోగమేళాను నిర్వహించనున్నారు. ప్రముఖ కంపెనీ అయిన కడపకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ వారు ట్రైనీ క్వాలిటీ ఎగ్జిక్యూటివ్, ట్రైనీ సూపర్‌వైజర్, హెచ్‌ఆర్ ట్రైనీ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని నిర్వాహకులు తెలియజేశారు. ఉద్యోగంలో చేరిన వారు ఐదు సంవత్సరాల బాండ్ ఇవ్వాల్సి ఉంటుందని, అందుకు సమ్మతించిన వారు మాత్రమే హాజరు కావాలని చెప్పారు.

ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలగా గుర్తింపు



గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న మిట్స్ ప్రతినిధులు

కురబలకోట: రాష్ట్రంలో ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలగా అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు గుర్తింపు లభించిందని యూనివర్సిటీ ప్రతినిధి యువరాజ్ మంగళవారం తెలిపారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాల అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.అదే విధంగా ఈ కళాశాల విద్యార్థిని కాగిత భార్గవికి రాష్ట్ర ఉత్తమ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థినిగా, బీటెక్ విద్యార్థి కార్తీక్ కోవికి ఉత్తమ కంప్యూటర్ సైన్స్ విద్యార్థిగా అవార్డులు దక్కినట్లు తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు

నందలూరు: దేశంలోనే మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చిందని జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై, ఎంపీడీఓ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రజల చేతిలో ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన పీ–4 గ్రామసభలో వారు మాట్లాడుతూ మనమిత్ర వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రభుత్వ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వీలుగా ఉంటుందని అన్నారు. వాట్సాప్ నంబర్ 95523 00009 ద్వారా 200 పథకాల గురించి అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. నాగిరెడ్డిపల్లె, నందలూరు సచివాలయాల్లో ఇప్పటి వరకు 100 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. నాగిరెడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి బండ్ల సురేష్‌కుమార్, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణ ప్రణాళికపై అవగాహన

వీరబల్లి: రుణ ప్రణాళికలపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బండి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా తమ జీవనోపాధుల ఏర్పాటుకు ఎంతో రుణం కావాలని, దానికి సంబంధించిన వివరాలు యాప్‌లో బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయనున్నట్లు చెప్పారు. వివరాలన్నీ బ్యాంకు మేనేజర్ లాగిన్‌కు వెళ్తాయన్నారు. సంఘం ద్వారా తీసుకున్న అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ ద్వారా వెళ్తాయని తెలిపారు. పలు విషయాలపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు వెంకటరమణ, లీగల్ కో–ఆర్డినేటర్ ఆనందబాబు, స్థానిక ఏపీఎం ఖాదర్ వల్లి, సీసీఎల్ కృష్ణయ్య, సుధాకర్, గంగాధర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా పీ4 అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: పీ–4 కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకుచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుంచి పీ- 4 అమలుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మెరుగైన తోడ్పాటు ఇచ్చేందుకు ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం బంగారు కుటుంబాలుగా నమోదైన వారికి చేయూతను ఇవ్వడం కోసం ఆగస్టు 15లోగా మార్గదర్శకుల నమోదు పూర్తి చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలకు సంబంధించి పలు సూచనలు కలెక్టర్ జారీ చేశారు.

ఏకచక్రాధిపత్యం

- ఆది నుంచి వైఎస్ కుటుంబం బలపరిచిన వారిదే గెలుపు
- పులివెందుల, ఒంటిమిట్టల్లోనూ 25 ఏళ్ల చరిత్రలో విజయం ఏకపక్షం
- అధికారం అండగా.. కుట్రలకు తెర తీస్తున్న టీడీపీ
- నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ ముగియడంతో వేడెక్కిన రాజకీయం



సాక్షి రాయచోటి: ఎన్నికలు జరుగుతున్న రెండు మండలాల్లో ఎన్నో ఏళ్లుగా ఏకఛత్రాధిపత్యమే కొనసాగుతోంది. ఆది నుంచి కూడా వైఎస్ కుటుంబానికి కంచుకోటలుగా ఉండడమేగాక, ఆ కుటుంబం బలపరిచిన అభ్యర్థులే గెలుపుబావుటా ఎగురవేస్తూ వస్తున్నారు. అభ్యర్థి ఎవరైనా కులమతాలు, వర్గాలు బేధం చూడకుండా ఓటర్లు గెలుపును ఏకపక్షం చేస్తూ వస్తున్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాం నుంచి ఇప్పటివరకు 25 ఏళ్ల చరిత్రను పరిశీలించినా పులివెందులతోపాటు ఒంటిమిట్టలోనూ కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయఢంకామోగిస్తూ వస్తున్నారు.

టీడీపీ కుట్రలు...కుయుక్తులు

వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట మండలానికి సంబంధించి జెడ్పీ చైర్మన్‌గా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కొనసాగుతూ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఈ నేపథ్యంలో ఒంటిమిట్ట జెడ్పీటీసీతోపాటు జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఒంటిమిట్ట ఉప ఎన్నిక అనివార్యమైంది. అలాగే పులివెందులకు సంబంధించి గతంలో జెడ్పీటీసీగా పనిచేస్తున్న మహేశ్వర్‌రెడ్డి మృతి చెందడంతో అక్కడ కూడా ఎన్నిక తప్పనిసరిగా మారింది. ఈ నేపథ్యంలో రెండుచోట్ల బలంగా ఉన్న వైఎస్సార్ సీపీని ఢీ కొట్టలేక అధికారంలో ఉన్న కూటమి సర్కార్ కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులతోపాటు దాడులకు తెగబడుతోంది. పోలీసుల ద్వారా బైండోవర్ పేరుతో వైఎస్సార్ సీపీ నేతలను భయపెట్టడం ఒక ఎత్తయితే, మరోవైపు వైఎస్సార్ సీపీ నాయకులపై ప్రత్యక్ష దాడులకు దిగుతూ భయాందోళనలు సృష్టిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో కూడా అలజడులు సృష్టించి క్యాడర్‌ను ఆందోళనలకు గురి చేయాలని చూస్తున్నారు. ఏదో ఒక రకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులను భయభ్రాంతులకుగురి చేయాలన్న సంకల్పంతో టీడీపీ పులివెందులలో వికృత చేష్టలకు తెర తీయడంపై పలువురు రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ కీలక నేతల ప్రచారం

జిల్లాలోని పులివెందుల మండలంలో వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డికి మద్దతుగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తుండడంతో సందడి వాతావరణం నెలకొంది. మరోవైపు ఒంటిమిట్ట మండలానికి సంబంధించి వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు మద్దతుగా జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తుండడంతో మరోవైపు టీడీపీ కూడా ప్రచారం చేస్తోంది.

వేడెక్కిన రాజకీయం

జిల్లాలో రెండు జెడ్పీటీసీలకు సంబంధించి ఎన్నికలు జరుగుతుండడంతో రాజకీయం వేడెక్కింది. ఈ ఎన్నికలను టీడీపీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుని అధికార బలాన్ని ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు. ఇన్‌చార్జి మంత్రి సవిత పులివెందులలో కూర్చొని మంత్రాంగం నడిపిస్తుండగా, ఒంటిమిట్టలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఎక్కడికక్కడ పావులు కదుపుతున్నారు. జెడ్పీటీసీ లాంటి చిన్న పాటి ఎన్నికలను కూడా అధికారంలోకి కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని పరువు కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం గమనార్హం. ఎన్నికల నేపథ్యంలో పోలీసు యంత్రాంగాన్ని వినియోగించడం మొదలుకొని ఏదో రకంగా మంత్రులు అక్కడే మకాం వేసి ప్రత్యేకంగా కృషి చేస్తున్న తీరును చూసి పలువురు విస్మయం చేస్తున్నారు.

తిరుగులేని ఆధిక్యం

వైఎస్సార్ కడపజిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఏళ్ల చరిత్రను పరిశీలిస్తే ప్రతిసారి తిరుగులేని ఆధిక్యత వైఎస్సార్ కుటుంబం బలపరిచిన అభ్యర్థులదే కనిపిస్తోంది. దాదాపు 25 ఏళ్లలో పలు దఫా లుగా జరిగినా ప్రతి ఎన్నికలోనూ అటు కాంగ్రెస్ (వైఎస్సార్ హయాంలో), తర్వాత క్రమంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయఢంకా మోగిస్తూ వస్తున్నారు. ఎప్పుడు చూసినా ప్రజలు కూడా నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న వైఎస్సార్ కుటుంబం వైపే మొగ్గుచూపుతున్నారు. వర్గాలు, వైషమ్యాలు, రాజకీయాలను పక్కనపెట్టి ఓటర్లు కూడా వైఎస్సార్ కుటుంబం ఎవరికి మద్దతు ఇస్తే వారినే గెలిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటూ వస్తున్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- ఒంటమిట్ట బరిలో 11 మంది
- పులివెందులలో 11 మంది

కడప సెవెన్‌రోడ్స్: ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. పులివెందుల స్థానానికి 12 మంది, ఒంటిమిట్ట స్థానానికి 21 మంది తొలుత నామినేషన్లు సమర్పించారు. ఉపసంహరణల అనంతరం ఒంటిమిట్టలో 11 మంది, పులివెందులలో 11 మంది బరిలో ఉన్నారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), పూల విజయభాస్కర్ (కాంగ్రెస్), ముద్దుకృష్ణారెడ్డి (తెలుగుదేశం పార్టీ), అరిగేల సౌమిత్రి చంద్రనాథ్, కోనేటి హరి వెంకట రమణ, గుండు మల్లికార్జునరెడ్డి, టక్కోలి శివారెడ్డి, నడివీధి సుధాకర్, వై.మధుమూర్తి, మామిళ్ల ఈశ్వరయ్య, వెంకటేష్ నంద్యాల స్వతంత్రులుగా పోటీలో ఉన్నారు.

పులివెందులలో..

పులివెందుల స్థానానికి తుమ్మల హేమంత్‌రెడ్డి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), మారెడ్డి లతారెడ్డి (తెలుగుదేశం పార్టీ) మొయిళ్ల శివ కల్యాణ్‌రెడ్డి (కాంగ్రెస్), అంకిరెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి, తుమ్మనూరు అనిల్‌కుమార్‌రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, మారుజోళ్ల గజేంద్రనాథ్‌రెడ్డి, మారెడ్డి జయభారత్‌రెడ్డి, ముద్దిగారి వెంగళరెడ్డి, యాదటి సునీల్‌యాదవ్ స్వతంత్ర్య అభ్యర్థులుగా రంగంలో ఉన్నారు.

ఒంటిమిట్ట టీడీపీ అభ్యర్థిగా ముద్దు కృష్ణారెడ్డి



బీ ఫారంను అందుకుంటున్న ముద్దు కృష్ణారెడ్డి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి టీడీపీ అభ్యర్థిగా అడ్డలూరు ముద్దు కృష్ణారెడ్డి పేరును మంగళవారం అధిష్టానం ప్రకటించింది. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు కడప జెడ్పీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజుతో కలిసి ముద్దుకృష్ణారెడ్డి సీఈఓ ఓబులమ్మ చేతులు మీదుగా బీ–ఫారం అందుకున్నారు.

ఉప పోరు.. ప్రచార జోరు

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



సాలాబాదు గ్రామంలో ఉప ఎన్నిక ప్రచారం చేస్తున్న ఆకేపాటి, అంజద్‌బాషా, సురేష్ బాబు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం జోరందుకుంది. ఆ పార్టీ నాయకులు గ్రామాల్లోకి ఎక్కడికి వెళ్లినా.. ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంగళవారం మండల పరిధిలోని సాలాబాదు, గంగపేరూరు గ్రామాలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, కోడురు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డిలు అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తో కలిసి జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఇరగంరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ..అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సును ఏర్పాటు చేస్తామని చెప్పి, తీరా అధికారం చేజిక్కించుకున్న తరువాత అదిగో.. ఇదిగో..అంటున్న ఈ కూటమి ప్రభుత్వానికి ఇరగంరెడ్డి గెలిపు ఒక గుణపాఠం కావాలన్నారు.

- రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ..అందరికి అనువుగా ఉండే రాజధాని అమరావతి అంటూ..కొద్ది పాటి వర్షాలకే నీట మునిగిపోయే ప్రాంతాన్ని రాజధానిగా చేసి, ప్రజలకు అందివ్వాల్సిన సంక్షేమ పథకాల నిధులన్నీ రాజధానికి దోచి పెడుతున్న సీఎం చంద్రబాబుకు ఈ ఎన్నిక చెంపపెట్టుకావాలన్నారు. - - బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా మాట్లాడుతూ..ఉన్నత చదువు చదివిన యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న మోసపూరిత ప్రభుత్వానికి సుబ్బారెడ్డి గెలుపు గుణపాఠం కావాలన్నారు.
- మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ.. బీసీలకు 50 సంవత్సరాలకే నెలకు రూ. 4 వేల పెన్షన్ ఇస్తానన్న సీఎం చంద్రబాబు హామీ నెరవేర్చకపోవడంతో బీసీల ఆశలు అవిరయ్యాయి. ఇలాంటి సాధ్యం కాని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఎంతో కాలం ఉండదన్న నిజం ఈ ఉప ఎన్నికతో నిరుపించాలన్నారు.
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ..చేనేత కార్మికులకు ఉచితంగా ఇస్తానన్న 200 యూనిట్ల కరెంటును కూడా ఇంతవరకు అమలు చేయకపోవడం కూటమి ప్రభుత్వం చేతకాని పాలనకు నిదర్శనం, ఇలాంటి అసమర్థత ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు.
- కడప మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ.. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రహ్మణులకు ఇస్తానన్న రూ. 25 వేల గౌరవ వేతనం ఇస్తామంటూ ఆశ కల్పిస్తున్నారన్నారు. అలాంటి ఆశలను చూపే వారికి మనం ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.
- కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ఇస్తానన్న 34 శాతం రిజర్వేషన్ కూడా ఇవ్వకుండా కూటమి నేతలు మోసాలు చేస్తున్నారు. వారికి బీసీల విలువ తెలియాలంటే ఈ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేయాలన్నారు.
- ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ..మెగా డీఎస్సీ అని కేవలం 16 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి, మెగా డీఎస్సీ అని కోతలకు పోతున్న ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే 2 లక్షల 50 వేల ఉద్యోగాల ఇచ్చిన సంగతిని గుర్తు చేయాలంటే ఈ ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలన్నారు
- రాయచోటి మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే అది వైఎస్సార్‌సీపీకే సాధ్యమన్నారు. కానీ కూటమి నాయకులు హామీలను చిత్తశుద్ధితో అమలు చేయడం లేదన్నారు. అలాంటి వారికి ప్రజల చిత్తశుద్ధి అంటే ఏమిటో ఈ ఉప ఎన్నికల్లో రుచి చూపాలన్నారు.
- జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు హామీలు..మోసాలకు నిలయాలని, అలాంటి మోసాలు చేసిన కూటమి ప్రభుత్వానికి ఉప ఎన్నికలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షురాలు అజంతమ్మ, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఒంటిమిట్ట మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాజంపేట నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్ రెడ్డి, సాలాబాదు సర్పంచ్ స్వర్ణలత, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, గంగపేరూరు సర్పంచ్ కూండ్ల బుజ్జమ్మ, వైఎస్సార్‌సీపీ ఒంటిమిట్ట మండల పంచాయతీ రాజ్ అధ్యక్షులు మేరువ శివనారాయణ వైఎస్సార్‌సీపీ నాయకులు మేకపాటి నందకిశోర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ముమ్మడి వెంకటకృష్ణారెడ్డి, లంకారామిరెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.



గంగపేరూరులో ప్రచారం చేస్తున్న ఎంపీ రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే సుధ, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి తదితరులు

ప్రభుత్వ స్థలం.. పరాధీనం

- టీడీపీ నాయకుడి భూ బాగోతం
- క్రీడామైదానానికి కేటాయించిన భూమి ఆక్రమణ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం


టాస్క్‌ఫోర్స్: అన్నమయ్యజిల్లా రాజంపేటలో అధికారం అండగా టీడీపీ శ్రేణులు భూ ఆక్రమణలకు తెరతీస్తున్నారు. తమను ఎవరు ఏమి చేయలేరన్న ధైర్యం..అడిగేవారు లేరన్న ధీమాతో టీడీపీ నాయకులు అడ్డదారులకు రాచబాట వేసుకొని వెళుతున్నారు. ఇప్పటికే భూములు, స్థలాలు, మద్యం, ఇసుక, మట్టి వంటివాటిని దోచేస్తున్నారు. రాజంపేట పరిధిలో భూములు కోట్లాది రూపాయిలు విలువ చేస్తున్న తరుణంలో తెలుగు తమ్ముళ్ల సులువుగా కోటీశ్వర్లు అయ్యేందుకు ప్రణాళికలు వేసుకున్నారు. ఖాళీ జాగా వేసేయ్ పాగా అన్నచందంగా భూకబ్జాల పర్వం కొనసాగుతోంది. పేద ప్రజలు ఏమాత్రం విలువ చేయని ప్రాంతంలో రెండు సెంట్ల ప్రభుత్వ స్థలంలో చిన్నపాటి గుడిసె వేసుకున్నా అధికారులు ఆగమేఘాల మీద చర్యలకు ఉపక్రమిస్తారు. అయితే రాజంపేట మండలంలో కూటమి నాయకులు కోట్లాది రూపాయిల విలువ చేసే భూములు, స్థలాలు కబ్జాచేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుంటే.. రాజంపేట మండలంలోని మిట్టమీదపల్లె పొలం సర్వే నంబర్ 1066లో చుండువారిపల్లెలో ఉన్న ఎస్టీ ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన నాలుగు ఎకరాల క్రీడామైదానాన్ని మండలంలోని అదే గ్రామానికి చెందిన చుండు సుధీర్ దర్జాగా ఆక్రమించుకున్నాడు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరా భూమి మార్కెట్ విలువ ప్రకారం నాలుగు కోట్ల రూపాయిల వరకు ఉన్నట్లు ఆ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు. ఆమేరకు నాలుగు ఎరకాల స్థలం దాదాపు 16 కోట్ల రూపాయిల విలువ చేస్తుంది. ఆక్రమించుకున్న భూమిలో సుధీర్ భవనం నిర్మించుకోవడంతో పాటు పలు రకాల పండ్ల చెట్లను కూడా దర్జాగా సాగు చేసుకుంటున్నాడు. ఎస్టీ విద్యార్థుల సౌకర్యార్థం కేటాయించిన స్థలం కావడం వల్లే తనను ఎవరు అడగరన్న ధీమాతో సుధీర్ భూ ఆక్రమణకు తెగబడినట్లు తెలుస్తోంది. క్రీడామైదానం కోసం కేటాయించిన స్థలాన్ని దర్జాగా ఆక్రమించుకున్న విషయాన్ని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూసేందుకు సాహసం చేయడం లేదంటే అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చుండు సుధీర్ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడుకు ముఖ్య అనుచరుడిగా ఉంటుండటం వల్ల అధికారులకు కొంతమంది ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



క్రీడామైదానం పాఠశాకు కేటాయించిన స్థలంలో నిర్మించిన భవనం



ఆక్రమించిన స్థలంలో టెంకాయ చెట్లు వేసిన దృశ్యం



జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదు

మిట్టమీదపల్లె పొలం సర్వే నంబర్‌లోని 1066 సర్వే నెంబర్‌లో నాలుగు ఎకరాల భూమిని చుండు సుధీర్ కబ్జా చేసినట్లు అదే పంచాయితీలోని కొమ్మివారిపల్లె అరుంధతివాడకు చెందిన గొంటు మణి తెలిపాడు. ఈ ఏడాది మార్చి నెలలో రెండుమార్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సుధీర్ భూకబ్జాపై ఫిర్యాదు చేశానని, దాదాపు ఐదు నెలలు అయినా ఏ అధికారి కూడా ఈ భూమిని కనీసం చూడను కూడా లేదని మణి ఆరోపించాడు.

నిత్యపూజ స్వామి తలనీలాల వేలం పాట



వేలం పాటను నిర్వహిస్తున్న ఆలయ ఈఓ శ్రీధర్

సిద్దవటం: శ్రీ నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను వైఎస్సార్ జిల్లా కమలాపురానికి చెందిన నాగయ్య రూ. 5.10 లక్షలకు దక్కించుకున్నారని ఈఓ శ్రీధర్ తెలిపారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల్ల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి ఆలయంలో తలనీలాల హక్కు కోసం మంగళవారం సిద్దవటంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, కమలాపురం, కడప, సిద్దవటం ప్రాంతాలకు చెందిన ఆరుగురు పాటదారులు పాల్గొన్నారని ఈఓ తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలో తాత్కాలిక షాప్‌లకు నిర్వహించిన వేలం పాటను సిద్దవటం ఎగువపేటకు చెందిన కూనా విజయభాస్కర్ రూ.1,43,000 దక్కించుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజంపేట దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా వైఎస్ఆర్ కడప జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కొండాపురంలో అత్యధికంగా 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సింహాద్రిపురంలో 10.6 మి.మీ, లింగాలలో 9.2, జమ్మలమడుగులో 4.2, మైలవరంలో 3.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

క్లుప్తంగా

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు


సుభాషిణి(ఫైల్)

సిద్దవటం : మండలంలోని ఎస్టీ కాలనీకి చెందిన సుభాషిణి ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించలేదని బంధువు గుర్రమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. గుర్రమ్మ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఎస్టీ కాలనీకి చెందిన సుభాషిణి టక్కోలు జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నెల 2వతేదీ పాఠశాల ముగిసిన తరువాత ఆమె ఇంటికి రాలేదని బంధువులు తెలిపారు. తమ బంధువుకు బాగాలేదంటూ నమ్మించి వరుసకు మేనమామ అయిన వ్యక్తి ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడని వారు తెలిపారు. బాలిక బంధువు గుర్రమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యాభర్తలపై దాడి

మదనపల్లె రూరల్ : స్థల వివాదం, వ్యక్తిగత కక్షలతో భార్యాభర్తలపై దాడిచేసిన ఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. నందిరెడ్డిగారిపల్లెకు చెందిన భార్యాభర్తలు అబ్దుల్‌బాషా(27), అమ్మాజాన్(22)లపై అదే ప్రాంతానికి చెందిన మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, నన్నీబీలు దాడికి పాల్పడ్డారు. దాడిలో భార్యాభర్తలు గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మున్సిపల్ ఉద్యోగిపై దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

మదనపల్లె రూరల్ : మున్సిపల్ ఫిట్టర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌పై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ వెంకట శివకుమార్ తెలిపారు. కుమారపురానికి చెందిన రాజా(46), నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ భూమలగడ్డకు చెందిన ప్రదీప్(30)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో మరో నిందితుడైన రవిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ


నుజ్జునుజ్జయిన లారీ

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి–మదనపల్లె రోడ్డులో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె రోడ్డు మార్గంలో ఏపీ39యువై 4126 నెంబర్ లారీ అతివేగంగా వచ్చి 11 కెవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి సమీపంలోని ఇంటి ముందు ఆగిపోయింది. ఈ ప్రమాదంలో పోల్ మొత్తం పూర్తిగా డ్యామేజ్ అయింది. స్పందించిన విద్యుత్తు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సరఫరా నిలిపివేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చేశారు. సకాలంలో స్పందించడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

నా భర్తను బతికించండి..

- ఆదుకోవాలంటూ భార్య కంటతడి
- ప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితమైన భర్త
- పిల్లల చదువు మాన్పించిన తల్లిదండ్రులు


భర్త పరిస్థితి చూపుతున్న సుబాష్ చంద్రబోస్ భార్య వెంకట సుబ్బమ్మ

రాయచోటి టౌన్ : తమను ఎవరైనా ఆదుకొంటారని...తన భర్తకు ప్రాణభిక్ష పెడతారనే కొండం ఆశతో ఎదురు చూస్తోంది...వెంకటసుబ్బమ్మ అనే మహిళ....? నా అనే వారు ఎవరూ లేక మంచానికే పరిమితమైన భర్త కోసం..పిల్లలను ఎలాగైనా చదివించాలనే తపన... వెరసి కొండంత భారాన్ని మోస్తోంది. ఆమెను కదిలిస్తే కన్నీళ్లు పర్యంతమవుతాయి. ఆమె మాటల్లోనే...నా భర్త పేరు సుబాష్‌చంద్ర బోస్...మేము రాయచోటి పట్టణంలోని కొత్తపేటలోని నాలుగు కుళాయిల సమీపంలో కాపురం ఉంటున్నాము. నా భర్త సుబాష్ చంద్రబోస్ (గతంలో వివిధ పత్రికలలో రిపోర్టర్‌గా పనిచేశాడు) ఫర్టిలైజర్ మేనేజర్‌గా పని చేస్తూ వచ్చే డబ్బుతో జీవనం సాగించేవాళ్లం. మాకు కుమార్తె మౌనిక, కుమారుడు ధరణీధర్ ఉన్నారు. మా సంసారం సాఫీగా సాగిపోతున్న సందర్భంలో మే 16వతేది జరిగిన రోడ్డు ప్రమాదం ఒక్కసారిగా మా కాపురాన్ని రోడ్డున పడేసింది. చిన్నమండెం మండలం కేశాపురం వద్ద నా భర్త స్కూటర్‌పై వస్తుండంగా ఒక కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు హెల్మెట్ ధరించడంతో గాయాలు కాలేదు కానీ.. కాళ్లు, నడుము భాగం పూర్తిగా విరిగిపోయింది. పరిస్థితి విషమంగా ఉండటంతో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి డాక్టర్లను సంప్రదిస్తే తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ పలు ఆస్పత్రులలో చికిత్స చేయించినా ఎలాంటి ప్రయోజనం లేదు. అనంతరం ఏలూరు ఆస్పత్రికి వెళ్లమన్నారు. అక్కడ 11 యూనిట్ల రక్తం ఎక్కించారు. పది రోజుల తరువాత ఆపరేషన్ చేసి కుడికాలు తొడభాగంలో కండ తీసి ఎడమ కాలుకు ఆపరేషన్ చేశారు. నడుము విరిగిపోవడంతో స్టీల్ రాడ్ బిగించారు. అప్పటికే రూ.15లక్షలు మంచి నీళ్లప్రాయంగా అయిపోయాయి. దొరికినకాడికిల్లా... తీసుకొచ్చి ఖర్చుపెట్టినా ఎలాంటి ప్రయోజనం కనిపించడంలేదు. మంచానికే పరిమితమై ద్రవపదార్థాలు మాత్రమే ఇస్తున్నాం. కనీసం ఒక వైపు కదలలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. మా ఫిర్యాదు తీసుకోలేదు. కేసు నమోదు చేసి ఉంటే మాకు ఎంతో కొంత న్యాయం జరిగుండేది. ఇప్పుడు కుటుంబాన్ని పోషించడానికి చేతిలో చిల్లిగవ్వ లేదు. పాప ఇంటర్ ఎంపీసీ పూర్తిచేసి ఎంసెట్ కౌన్సిలింగ్‌కు వెళ్లాలని ఉన్నా చదివించే స్తోమత లేక ఆపేశాం. బాబు పదో తరగతి పాసయ్యాడు. విజయవాడలో ఉన్నాడు. వాడిని మాన్పించాలనే ఆలోచనలో ఉన్నాం. మందులు కొనుక్కోవడానికి పది రూపాయలు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇరుగు పొరుగువారు చేసే సాయంతో కాలం వెళ్లదీస్తున్నాం. దాతలు సహాయం చేసి తిరిగి నా భర్తను బ్రతికిస్తే చాలు...వారికి రుణ పడి ఉంటాం.

దాతల సహకారం....

సుభాష్‌చంద్రమోబోస్ కుటుంబానికి రాయచోటి జర్నలిస్టులు రూ.13 వేల ఆర్థిక సహాయం అందించగా, రాయచోటి జిన్నా సేవా సంస్థ యజమాని రూ.10 వేలు ఆర్థిక సహాయం చేసి అంబులెన్స్ సమకూర్చారు. భవిష్యత్తుల్లో మరింత సహాయసహకాలు అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. వారి కుటుంబానికి ఆర్థికంగా సహకరించే వారు ఫోన్ నంబర్ 9618218655కు ఫోన్ పే ద్వారా ఆర్థిక సహాయం అందిచాల్సిందిగా వారు కోరారు.

విషగుళికలు తిని వ్యాపారి ఆత్మహత్య


మృతి చెందిన ఉండేల పెద్దఓబుళరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలోని బ్రాహ్మపేట వీధికి చెందిన వేరుశనగకాయల వ్యాపారి ఉండేల పెద్ద ఓబుళరెడ్డి (55) విష గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ శివారులోని కంపోస్టు యార్డులో పెద్ద ఓబుళరెడ్డి వేరుశనగ మిల్లు నిర్వహిస్తున్నాడు. పలువురు వ్యాపారుల వద్ద వేరుశనగ కాయలు తెచ్చి వ్యాపారం సాగించాడు. అప్పుల భారంతో మంగళవారం ఉదయం తన మిల్లులోనే విష గుళికలు మింగాడు. పరిస్థితి విషమించడంతో అతనిని స్థానిక హోమస్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పెద్ద ఓబుళరెడ్డి మృతి చెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన తనపై జరిగిన దాడి సంఘటనను పెన్నుతో చేతిలో రాసుకున్నట్లు గుర్తించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం చేశారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం దొంగల అరెస్ట్

చాపాడు : మండలంలోని మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో ఖాదర్‌పల్లె క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం ముగ్గురు ఎర్రచందనం దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. గత నెల 23న ప్రొద్దుటూరు నుంచి ఎర్రచందనం దుంగలను కారులో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ముగ్గురు పారిపోగా, ఇద్దరు దొంగలను పట్టుకుని దుంగలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనంతరం పారిపోయిన ప్రొద్దుటూరుకు చెందిన కందుకూరి బాల దస్తగిరి, ఖాదర్‌పల్లెకు చెందిన షేక్ లాల్‌బీ, హైదరాబాద్‌కు చెందిన హేమంత్ సింగ్ సోలంకిలను ఖాదర్‌పల్లె క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశామని తెలిపారు. మంగళవారం కోర్టులో హాజరు పరచినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య చెప్పారు.

పసివాడిపై చోరీ ముద్ర

పారిపోయిన వచ్చాడని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగింత

మైదుకూరు : పారిపోయి వచ్చిన బాలుడిపై చోరీముద్ర వేసి ఓ వ్యక్తి చేసిన హడావిడి చివరకు ఆ బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చింది. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన కావడి సతీష్, రూత్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కుమారుడు ఉన్నారు. 12 ఏళ్ల బాలుడు ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం భార్యభర్తలు ఇరువురు ఇంటిలో గొడవ పడ్డారు. ఆ సమయంలో ఇంటిలో ఉన్న కుమారుడిపై తల్లి రూత్ గట్టిగా కేకలు వేసింది. బాధపడిన బాలుడు ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. మంగళవారం ఉదయం మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కర్నూలు–తిరుపతి సర్వీసు బస్సులో డబ్బు కోసం ప్రయాణికులను యాచిస్తున్నాడు. అదే సమయంలో మైదుకూరుకు చెందిన ఖాజా అనే వ్యక్తి తిరుపతి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. కొంతసేపటికి తన సెల్ ఫోన్ కనిపించలేదని హడావుడి చేసిన ఖాజా తన సెల్‌ఫోన్‌ను దొంగలించాడని ఆ పిల్లవాణ్ణి పట్టుకున్నాడు. తాను దొంగలించలేదని బాలుడు ఏడుస్తూ చెప్పాడు.బాలుడిని బస్సు నుంచి కిందకు దించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అది గమనించిన మైదుకూరు డిపోకు చెందిన జనరల్ ఏడీసీ ఎం.లక్ష్మయ్య స్టేషన్‌కు చేరుకుని బాలుడితో మాట్లాడారు. బాలుడు చెప్పినదంతా విని ఈ అబ్బాయి సెల్‌ఫోన్ దొంగలించి ఉండడన్నారు. బాధితునితో సెల్ నంబర్‌ను చెప్పించుకుని ఆ నంబర్‌కు ఫోన్ చేశారు. ఖాజా సెల్ ఫోన్‌ను కర్నూలు–తిరుపతి బస్సులో ఉన్న ఓ వ్యక్తి ఎత్తి మాట్లాడాడు. ఎవరిదో సెల్ ఫోన్ సీట్‌పై పడి ఉండగా తీసి తన వద్ద ఉంచుకున్నట్టు ఆ వ్యక్తి చెప్పాడు. అది మైదుకూరుకు చెందిన ఓ వ్యక్తిదని, దయచేసి దానిని కడప బస్టాండ్‌లోని ఎంక్వైరీ వద్ద డ్యూటీలో ఉన్న వంశీ అనే వ్యక్తికి అందజేయాలని ఏడీసీ లక్ష్మయ్య కోరారు. ఫోన్ బస్సులో జారి పడగా చూసుకోకుండా బాలుడిపై నిందలు వేసినందుకు పోలీసులు ఖాజాను మందలించి పంపారు. ఏడీసీ లక్ష్మయ్య బాలుడిని తీసుకువెళ్లి టిఫిన్ పెట్టించారు. తర్వాత బాలుడి తల్లి రూత్ నంబర్‌ను తీసుకొని ఆమెతో మాట్లాడారు. మీ అబ్బాయి మైదుకూరులో తమ వద్ద క్షేమంగా ఉన్నాడని చెప్పారు. తన కుమారుడిని తమ వద్దకు పంపాలని ఆమె అభ్యర్థించింది. ఆ మేరకు నెల్లూరు–అనంతపురం సర్వీస్ బస్సులో ఎక్కించిన లక్ష్మయ్య టికెట్ తీయించి రూ.360ను అతని జేబులో ఉంచారు. సాయంత్రం తన కుమారుడు ఇంటికి చేరుకోగానే తల్లి రూత్ సంతోషంతో ఏడీసీ లక్ష్మయ్యకు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. బాలుడి పరిస్థితిపై జాలిపడి చొరవ చూపి అతడిని నిర్దోషిగా తేల్చి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చి మానవత్వాన్ని చూపిన ఆర్టీసీ అధికారి లక్ష్మయ్య అందరి మన్ననలను అందుకున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఖరారు చేసిన షెడ్యూల్ మేరకు 2025–26 విద్యా సంవత్సరానికిగానూ ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆగష్టు 18వ తేదీ నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్లు మొదలవుతాయని తెలిపారు. జిల్లాలో, జిల్లా బయట ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆగష్టు 21 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ పత్రాల పరిశీలన, 21 నుంచి 24వ తేదీవరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదు, 25వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల మార్పుకు అవకాశం ఉంటుందన్నారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బందిచే విద్యార్థుల కోసం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆగష్టు 27న సీట్లను కేటాయిస్తారని, 28వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు.

పోలీస్ శిక్షణా కేంద్రం పరిశీలించిన ఎస్పీ


శిక్షణ కేంద్రం పరిశీలిస్తున్న ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్

కడప అర్బన్ : కడప శివారులోని పోలీస్ శిక్షణా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. స్టైఫెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్‌సీటీపీసీ)కు శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలోడీటీసీ పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, కిచెన్, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను చూసి త్వరితగతిన శిక్షణకు పూర్తి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్, ఇతర శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే మైదానం, క్లాస్ రూమ్స్, రన్నింగ్ ట్రాక్, పరేడ్ గ్రౌండ్స్, డ్రిల్ ఏరియా, బాటిల్ అబ్స్టాకల్స్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. శిక్షణ కేంద్రంలో వసతి సదుపాయాలు ఏర్పాటుచేసుకోవాలని, మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, డీటీసీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతోనే ఏకాగ్రత, మానసిక ప్రశాంతత సాధ్యం


యోగా చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయినులు

కడప ఎడ్యుకేషన్ : మానసిక ఒత్తిడి నుంచి బయట పడి శారీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పొందేందుకు విద్యార్థులకు యోగా ఔషధం లాగా పనిచేస్తుందని విద్యాశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు అన్నారు. వృత్త్యంతర శిక్షణలో భాగంగా కడప నగర శివారులోని గ్లోబర్ ఇంజినీరింగ్ కళాశాలలో కేజీబీవీల ఉపాధ్యాయులకు మంగళవారం యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయినులు యోగాపై అవగాహన పెంచుకుని కేజీబీవీ విద్యార్థినులకు నేర్పించాలన్నారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు మాట్లాడుతూ యోగా నిర్వహించడంతో శారీరక, ఆరోగ్య సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం యోగా ట్రైనర్ శ్రీలక్ష్మి ఉపాధ్యాయినులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వీరేంద్ర, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ సంజీవరెడ్డి, అఖిల్, అనూష, వింధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భారతి విద్యార్థి ఎంపిక


నరేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్

కమలాపురం : మండలంలోని నల్లలింగాయపల్లెలోని డీఏవీ భారతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎంవీ.నరేష్ రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివ్వం కిషోర్‌కుమార్ తెలిపారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లోని డీఏవీ భారతి పాఠశాల విద్యార్థులు ఈ నెల 3న ప్రొద్దుటూరు మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొన్నారు. జావెలిన్ త్రోలో నరేష్ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వతేదీ వరకూ బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో నరేష్ పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా పరిశ్రమ సీఎంఓ సాయిరమేష్, హెచ్‌ఆర్ హెడ్ గోపాల్‌రెడ్డి, ఐఆర్ అండ్‌పీఆర్ హెచ్.భార్గవ్ రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి విద్యార్థితో పాటు పీడీ రామచంద్రను అభినందించారు.

'రండి.....టీ తాగుతూ మాట్లాడుకుందాం'

ప్రభుత్వ ఉద్యోగుల వినూత్న కార్యక్రమం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం కడప ఇరిగేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగుల సమస్యలను ఒక వీడియో రూపంలో ఉద్యోగుల ముందుకు తీసుకు రావడం జరుగుతోంది. ఏపీజీఈఏ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఉద్యోగుల హక్కులపై అందరినీ చైతన్యపరిచి ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేలా కృషి చేయడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు కృష్ణప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, బీవీ చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్ : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించి వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల టీడీపీలో చేరిన పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డిని వైఎస్.భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిలు పార్టీలోకి రావాలని సముదాయించేందుకు ప్రయత్నించారన్నారు. భాస్కర్‌రెడ్డి ఫోన్ చేస్తే విశ్వనాథరెడ్డి ఫోన్ ఎత్తలేదని.. ఈ మాత్రానికే బెదిరించినట్లు కేసుపెట్టడం దారుణమన్నారు. వైఎస్.భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డిల బెయిల్ రద్దు చేయాలని సీబీఐని కోరుతామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి మాట్లాడటాన్ని బట్టి చూస్తే వారి కుట్ర బయటపడుతోందన్నారు. ఆచ్చివెల్లి ఎస్సీ కాలనీకి చెందిన వారిని బలవంతంగా టీడీపీలో చేర్చుకున్నాని దళితులు చెబితే ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. శాంతియుతంగా ఇంటింటి ప్రచారం చేస్తుంటే ఓటమి భయంతో టీడీపీ నేతలు అక్రమ కేసులకు తెరతీశారన్నారు. ఈకార్యక్రమంలో షేక్ షఫీ, బి.సుబ్బరాయుడు, ఎస్.వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. కోటవారిపల్లె పంచాయతీ బండకిందపల్లెకు చెందిన షకీలా(35) కూలి పనులు చేస్తూ జీవిస్తోంది. భర్త లేకపోవడంతో కుటుంబాన్ని పోషించుకుంటూ ఒక కుమార్తెకు వివాహం చేసింది. ఈ క్రమంలో రెండురోజుల కిందట ఇంటికి వచ్చిన కుమార్తెతో కుటుంబ సమస్యలపై మంగళవారం గొడవపడింది. అనంతరం మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పురిటి బిడ్డకు పునర్జన్మ


పురిటిబిడ్డ, తల్లితో సుండుపల్లె పీహెచ్‌సీ వైద్యులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో 11 రోజుల పురిటి బిడ్డకు ప్రాణం పోశాడు డాక్టర్ దిలీప్ గుప్తా. వివరాలలోకి వెళ్లితే.. రాయవరం గ్రామంలో 11 రోజుల చిన్న బిడ్డకు స్నానం చేయిస్తున్న సమయంలో పొరపోయింది. వెంటనే ఊపిరితిత్తుల్లోకి నీరు చేరడంతో ఊపిరాడక ప్రాణాపాయస్థితిలో బిడ్డ అల్లాడిపోయింది. తల్లిదండ్రులు వెంటనే పాపను సుండుపల్లె ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ దిలీప్ గుప్తా, ఫర్స్టాఖానం వైద్యం అందిచారు. బిడ్డ ప్రాణాలను కాపాడి పునర్జన్మ ప్రసాదించారు.త ల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

8న అండర్–22 క్రీడల పోటీలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శాప్ అదేశాల మేరకు ఈ నెల 8న అండర్–22 టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. డాక్టర్ వైఎస్ క్రీడా పాఠశాలలో ఆర్చరీ, హాకీ వెయిట్ లిఫ్టింగ్(అన్ని విభాగాలు) పోటీలు, డీఎస్ఏ స్టేడియంలో అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి విభాగంలో విజేతగా నిలిచి ఎంపికైన జట్టు తిరుపతిలో ఈ నెల 11వతేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

లింగాల : మండలంలోని గుణకణపల్లెలో బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన లోమడ శ్రీనివాసులు ఇంట్లో సోదాలు నిర్వహించి 12 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసులును అరెస్టు చేశామని హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు.

అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం


రాజ్యలక్ష్మి, పంచాయితీ అధికారి

కడప కార్పొరేషన్ : జిల్లాలోని అన్ని పంచాయితీలలో అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా పంచాయితీ అధికారి జి.రాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. విక్రయ ఒప్పందం లేదా హక్కు పత్రంతో ఉన్న అనధికార లే అవుట్‌కు 90 రోజుల్లో వ్యక్తిగతంగా రెగ్యులైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్)కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగష్టు 4వ తేదీ నుంచి ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్ ఓపెన్‌లో ఉంటుందన్నారు. ఓపెన్ స్పేస్ చార్జీలు 45 రోజుల్లో పూర్తిగా చెల్లిస్తే పది శాతం, 90 రోజుల్లో చెల్లిస్తే 5 శాతం పెనాల్టీ తగ్గింపు ఉంటుందన్నారు. ఇప్పటికే ఐపీఎల్‌పీ ఆమోదింపబడిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, కొత్తగా వచ్చిన దరఖాస్తులను తక్షణం పరిష్కరించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9849966639 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఫుట్‌బాల్ బాలికల విజేత వైఎస్సార్ జిల్లా


మెమెంటో అందుకుంటున్న విజేతగా నిలిచిన వైఎస్సార్ కడప జిల్లా జట్టు


మెమెంటో అందుకుంటున్న మూడో స్థానంలో నిలిచిన అన్నమయ్య జిల్లా జట్టు

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర అన్నారు. మండలంలోని పోతోబోలు వేదా పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానం జరిగింది. రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఫైనల్స్‌లో విన్నర్స్‌గా వైఎస్సార్ కడప జిల్లా నిలిచింది. రన్నర్స్‌గా అనంతపురం, తృతీయ స్థానంలో అన్నమయ్య జిల్లా నిలిచాయి. విజేతలకు బహుమతులు అందించిన అనంతరం డీఎస్పీ మాటాల్డుతూ విద్యార్థి స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, ఎంచుకున్న క్రీడలో ప్రతిభ కనబరిస్తే ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశాలున్నాయని తెలిపారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని రెండింటినీ సమానంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, కార్యదర్శి మురళీధర్, కోచ్‌లు హరి, పవన్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, సురేష్, ఉమాదేవి, కమలేష్, అంజనప్ప, బాలాజీ పాల్గొన్నారు.